## క్లుప్తంగా

### దద్దుర్ల కేసులు వస్తే మాకు తెలియజేయండి

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: చిన్న పిల్లలు దద్దుర్లతో బాధపడుతున్న కేసులు వస్తే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని సర్వేలైన్స్ టీం సభ్యులు ప్రైవేట్ వైద్యులకు సూచించారు. ప్రత్తిపాడులో చిన్నారులకు శరీరంపై తీవ్ర స్థాయిలో దద్దుర్లు వస్తుండటంతో నరకయాతన అనుభవిస్తున్నారని, వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోవడం లేదంటూ ఈ నెల 28న 'సాక్షి'లో ప్రచురితమైన 'చిన్నారులపై దద్దుర్ల పంజా' కథనంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం ప్రత్తిపాడులో జిల్లా మలేరియా కార్యాలయం సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేయగా, శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ కార్యాలయం నుంచి డీఐవో ఆదేశాల మేరకు సర్వేలైన్స్ టీం సభ్యుడు విజయ్, ప్రత్తిపాడులో పర్యటించారు. స్థానిక హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్‌ఎంలు ప్రసన్న, వరలక్ష్మిలతో కలసి దద్దుర్ల బారిన పడిన చిన్నారులను పరిశీలించారు. రక్త నమూనాలను సేకరించేందుకు ప్రయత్నించినప్పటికీ, తల్లిదండ్రులు విముఖత వ్యక్తం చేయడంతో వెనుదిరిగారు. అనంతరం చిన్న పిల్లల వైద్యుల వద్దకు వెళ్లి ఇలాంటి దద్దుర్లు కేసులు వస్తే తమకు తెలియజేయాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థికి గాయాలైన ఘటన మండలం నారాకోడూరు గ్రామ శివారులో శనివారం జరిగింది. గుంటూరు ప్రాంతానికి చెందిన విద్యార్థి ఎం.మహేష్ ద్విచక్ర వాహనంపై చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు బయలుదేరాడు. మార్గ మధ్యలో నారాకోడూరు- బుడంపాడు గ్రామాల మధ్య ఉన్న ఈస్టన్ కంపెనీ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో విద్యార్థి మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### గుర్రం జాషువాకు నివాళి

పెదకాకాని: కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై పోరాడిన మహనీయుడు గుర్రం జాషువా అని ఎంపీపీఎల్ఈ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వేముల విజయకుమార్ ఆధ్వర్యంలో శనివారం విశ్వ కవి గుర్రం జాషువా జయంతి, భారత స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత గుర్రం జాషువా, భగత్‌సింగ్ చిత్రాపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### సంకల్ప్- 2024లో మలినేని విద్యార్థుల ప్రతిభ



ప్రత్తిపాడు: సంకల్ప్- 2024లో మలినేని కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు మలినేని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు తెలిపారు. గుంటూరు రూరల్ మండలంలోని కల్లం హరనాథ్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సంకల్ప్- 2024 కార్యక్రమంలో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ (ఏఐడీఎస్) ద్వితీయ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్) తృతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. డి.మంజీర టీం(ఏఐడీఎస్), పి. తేజస్విని (ఏఐఎంఎల్) విద్యార్థులు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారు. అదే విధంగా ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థినులు వీవీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన నేషనల్ టెక్నికల్ ఫెస్ట్‌లో డైవ్ ఇన్ థాట్స్ కార్యక్రమంలో పాల్గొని రెండు, నాలుగు, ఐదు స్థానాలు సాధించారు. వీరిని మలినేని సంస్థల అధినేత డాక్టర్ మలినేని పెరుమాళ్లు అభినందించారు.

### లయోలాలో స్వచ్ఛతా హి సేవ

గుంటూరు రూరల్: నల్లపాడులోని పాఠశాలలో స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవాన్ని స్వచ్ఛతా హి సేవ, పరిశుభ్రతే మన కర్తవ్యం అనే నినాదంతో నిర్వహించారు. లయోలా పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతిని స్వచ్ఛభారత్ దివస్‌గా ప్రకటించటం జరిగిందన్నారు. పాఠశాల సుపీరియర్ అండ్ కరెస్పాండెట్ రెవరెండ్ ఫాదర్ పోలిరెడ్డి అంతోని, ఎన్‌సీసీ ఆఫీసర్స్ పీ కోటేశ్వరరావు, పీ సురేష్ ఆధ్వర్యంలో 10వ(ఆంధ్రా) బాలికల బెటాలియన్, 25వ(ఆంధ్రా) బెటాలియన్, 8వ(ఆంధ్రా) ఎయిర్ స్క్వాడ్రన్ స్టాఫ్ మొత్తం 300 మంది ఎన్‌సీసీ కేడెట్స్ ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

**స్వచ్ఛతలో గ్రామస్తుల భాగస్వామ్యం**

ప్రత్తిపాడు: స్వచ్ఛతా హి సేవలో భాగంగా శనివారం నడింపాలెం పంచాయతీలోని ఎస్సీ కాలనీ, మెయిన్ రోడ్డు, పరిసర ప్రాంతాలలో మల, మూత్ర విసర్జన ప్రదేశాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా, గ్రామ ఇన్‌చార్జి సర్పంచి పాలెపు కుమారి, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డి. శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ, ఐటీసీ, ఫినిష్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్స్ ఉమా మహేశ్వరి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# రాజకీయ ప్రాబల్యం కోసమే చంద్రబాబు కుట్ర

- తప్పుడు ఆరోపణలు చేసిన వారికి శిక్ష తప్పదు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- చంద్రబాబు పాపం ప్రక్షాళన కోసం శ్రీ వేంకటేశ్వరస్వామికి పూజలు



పూజలు నిర్వహించిన అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం పవిత్రతను ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో అపవిత్రం చేశారని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. టీటీడీ విశిష్టతకు భంగం కలిగించే విధంగా చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు, చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలంటూ అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పొన్నూరు నియోజకవర్గంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పొన్నూరు పట్టణంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలోని స్వర్ణ వేంకటేశ్వరస్వామికి అంబటి మురళీకృష్ణ పూజలు చేశారు. అనంతరం గోవింద నామస్మరణతో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ విలేకరులతో మాట్లాడారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిపై ఉన్న విశ్వాసంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు స్వామిని దర్శించుకుంటారని తెలిపారు. అడ్డంకులు సృష్టించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శ్రీవారి దర్శనానికి రాకుండా అడ్డుకున్నారని, గతంలో వైఎస్ జగన్ ఎన్నోసార్లు తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారని అన్నారు. చంద్రబాబు తిరుమల పవిత్రతను దెబ్బతీశారని నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు వాడారని గత ప్రభుత్వంపై అపవాదు వేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైఫుల్లా, ఎంపీపీ భవనం పద్మలీల, వైస్ ఎంపీపీ అంబటి రాఘవయ్య, నాయకులు షేక్ నాజర్, ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావు, గేరా సంజీవ్, ఎండేటి వెంకట సుబ్బయ్య, నాగరాజు పాల్గొన్నారు.

**వేజండ్లలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు**



వేజండ్లలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలోని కోదండరామస్వామి దేవస్థానంలో శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రమైన తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రసాదంపై ఆరోపణలతో దేవ దేవుడికి ఆగ్రహం వచ్చి రాష్ట్ర ప్రజలపై చూపకుండా, అది అవాస్తవాలను ప్రచారం చేస్తున్న వారికి పరిమితమయ్యేలా స్వామి వారిని వేడుకుంటూ పూజలు చేశారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా సాక్షాత్తూ శ్రీ వేంకటేశ్వరస్వామినే పణంగా పెట్టారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు కాసు ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# చంద్రబాబువి స్వార్థరాజకీయాలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- నల్లపాడు శ్రీవేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: సాక్షాత్తు కలియుగదైవం శ్రీవేంకటేశ్వరుని దివ్య ప్రసాదం లడ్డును కేవలం తన స్వార్థరాజకీయాలకు చంద్రబాబునాయుడు అపవిత్రం చేసే విధంగా మాట్లాడని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలో నల్లపాడులోని శ్రీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు శనివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి అంబటి రాంబాబుతో పాటు వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు పార్లమెంట్ జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు మందపాటి శేషగిరిరావు, ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భగవంతుని ప్రార్థించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ చంద్రబాబు తిరుమల లడ్డుపై అసత్యపు ఆరోపణలు చేసి తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామినే అడ్డుపెట్టుకున్నాడన్నారు. చెప్పులు వేసుకుని కపట దీక్షలు చేసే పవన్‌కళ్యాణ్, చెప్పులు వేసుకుని పూజలు చేసే చంద్రబాబులకు అసలు దేవుళ్లపై నమ్మకం ఉందా? కేవలం హిందువులను అడ్డు పెట్టుకుని కులమతాలను రెచ్చగొట్టి, ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టి హింసాత్మకానికి పాల్పడిన వారిని దేవుడు తప్పనిసరిగా శిక్షిస్తాడన్నారు. చంద్రబాబువి కేవలం కుట్ర రాజకీయాలే కానీ ప్రజలకు నేటికి చేసిందేమి లేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్, మూడు సెంట్ల స్థలం, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి, ఎన్నికల అనంతరం వాటిని అమలు చేయకపోగా ప్రజలు ఎందుకు ఇవ్వట్లేదని రోడ్లపైకి వస్తారని సాక్షాత్తు కలియుగ దైవాన్ని దేవుని ప్రసాదాన్ని అడ్డుపెట్టుకుని కుట్రరాజకీయాలకు తెరతీశాడని దుయ్యబట్టారు. ప్రసాదంలో కల్తీ చేసిందే చంద్రబాబు ప్రభుత్వం, చంద్రబాబేనని దానిని ప్రతిపక్షాలకు అంటగట్టి ప్రజల్లో మత విద్వేషాలకు తెరతీసిన చంద్రబాబును ఆ శ్రీవేంకటేశ్వర స్వామి క్షమిస్తాడా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సొసైటీ చైర్మన్‌లు, మాజీ డైరెక్టర్‌లు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జ్‌లు, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయానికి పూలమాలలు తీసుకొని వెళ్తున్న మాజీ మంత్రి అంబటి, బలసాని తదితరులు

## సమాజానికి ఉపయోగపడేలా ఆవిష్కరణలు




మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ సుబ్బారావు

ప్రత్తిపాడు: భావి ఇంజినీర్లు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందించాలని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రోబోటిక్ ఆపరేటింగ్ సిస్టంపై 36 గంటల హ్యాకథాన్ నిర్వహించారు. హ్యాక్ బోర్డ్ ఫౌండర్, సీఈవో మహేశ్, టీమ్ సమక్షంలో జరిగిన హ్యాకథాన్‌లో మొత్తం 39 టీమ్‌లు పాల్గొన్నాయి. వివిధ రంగాలకు చెందిన అనేక వినూత్న ఆవిష్కరణలను విద్యార్థులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకాడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ రమేష్ పాల్గొన్నారు.

### ఇంటిలో చోరీ



పెదకాకాని: ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన ఘటన తక్కెళ్ళపాడులో చోటు చేసుకుంది. పెదకాకాని మండలం, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన షేక్ చినబాజి వ్యవసాయం చేయడంతో పాటు కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే శనివారం తెల్లవారుజామున 3 గంటలకు కూరగాయల తెచ్చేందుకు గుంటూరు హోల్‌సేల్ మార్కెట్‌కు వెళ్లాడు. పై అంతస్తులో భార్య, కుమార్తె నిద్రిస్తున్నారు. ఆయన మార్కెట్ నుంచి ఇంటికి వచ్చి చూసే సరికి కింద ఉన్న ఇంటి తలుపులు పగులగొట్టి ఇంటి అరమరలో ఉన్న బీరువా తాళాలు తీసి రూ.20 వేలు, 500 గ్రాములు వెండి, విలువైన చీరలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దొంగతనం జరిగిందని గుర్తించిన షేక్ చినబాజి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి క్లూస్‌టీం సభ్యులు, పోలీసులు చేరుకుని వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి నారాయణస్వామి తెలిపారు.

### కారు ఢీ కొని వ్యక్తి మృతి

పెదకాకాని: గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పలపాడు శివార్లలో చోటు చేసుకుంది. వివరాలు.. పెదకాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన షేక్ సత్తార్ తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం పనికి వెళ్లిన ఆయన పని ముగించుకుని రాత్రి ఇంటికి మరొకరి బైక్‌పై వస్తుండగా ఉప్పలపాడు శివారు రాధాసత్సంగ్ ఆశ్రమం వద్దకు చేరుకునే సరికి బైక్ ఆయిల్ అయిపోయి ఆగిపోయింది. ఇద్దరూ కలసి తక్కెళ్లపాడు శివారులో ఉన్న పెట్రోల్ బంక్‌లో ఆయిల్ పోయించుకునేందుకు బైక్‌ను వెనక్కి తిప్పి నడిపించుకుంటూ వెళుతున్నారు. అదే సమయంలో తెనాలి నుంచి గుంటూరు వైపు వేగంగా వస్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీ కొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రగాయాలై బైక్‌ను నెడుతున్న షేక్ సత్తార్(58) అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రత్యక్ష సాక్షి షేక్ బాజీ సైదా ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

## ప్రొటోటైప్ చాలెంజ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకులు

గుంటూరు రూరల్: రూపజ్ఞా- 2024 పేరుతో జాతీయ స్థాయి ప్రొటోటైప్ పోటీలను నవంబర్ 16వ తేదీన తమ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. శనివారం చౌడవరంలోని కళాశాలలో కార్యక్రమానికి చెందిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్, ఆర్.గోపాలకృష్ణ కళాశాల సిబ్బందితో కలసి కార్యక్రమం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియకి సంబంధించిన వెబ్ సైట్‌ను ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి ప్రతిభకలిగిన విద్యార్థులు ప్రొటోటైప్ చాలెంజ్ ద్వారా వారి ఆలోచనలను పంచుకోవడానికి, తమ కళాశాల వేదిక కావడం ఆనందంగా ఉందని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థులు ఉపయోగించుకోవాలని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ నవంబర్ 2వ తేదీన కళాశాలలో జరిగే ప్రాథమిక దశ ఎంపికలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నవంబర్ 16న జరిగే ఫైనల్స్‌కి చేరుతారన్నారు. ఫైనల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులను సర్టిఫికెట్లను ప్రదానం చేయడంతో పాటుగా, వారిని అంకుర పరిశ్రమల స్థాపన వరకు ప్రోత్సహించేందుకు వారి ప్రొటోటైప్‌లను ప్రోడక్ట్ దశ వరకు చేరవేసేందుకు వారిని ప్రోత్సాహిస్తూ తమ కళాశాల ఇంక్యూబేషన్ సెంటర్ నుంచి రూ.10 లక్షల వరకు ఇగ్నిషియం గ్రాంట్ ద్వారా నగదును అందిస్తూ, వారికి అవసరమైన వసతులను, మౌలిక సదుపాయాలను కూడా అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ ప్రొటోటైప్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్:టీఐఎన్‌వైయూఆర్‌ఎల్.కమ్–ఫోటోటైపింగ్‌సీ అనే వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, డాక్టర్ కె.కార్తీకపవన్, డాక్టర్ ఎస్.రాధిక పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

చేబ్రోలు: సమాజం అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర గణనీయమైనదని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. చేబ్రోలు మండల యుటీఎఫ్ కార్యాలయంలో స్వర్ణోత్సవ మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ మండలం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఐక్యంగా సంఘం ద్వారా పోరాటం ద్వారానే హక్కులను నిలబెట్టుకోగలమన్నారు. 50 ఏళ్ల ప్రస్థానంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసి విజయాలను సాధించడంలో యూటీఎఫ్ పాత్ర ప్రముఖమైనదని అన్నారు. పాత పెన్షన్ విధానం సాధించేవరకు సంఘం చేసే పోరాటంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలుగా భాగస్వాములు అవుతామని తెలిపారు. రాష్ట్ర ప్రచురణాల కమిటీ కన్వీనర్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఈనెల 4, 5, 6వ తేదీలలో గుంటూరులో నిర్వహించనున్న యూటీఎఫ్ రాష్ట్ర క్రీడోత్సవాలలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్వర్ణోత్సవ మహాసభలు డిసెంబర్‌లో కాకినాడలో జరుగుతాయని చెప్పారు. జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వరరావు మండలంలో యూటీఎఫ్ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. మండల నూతన కమిటీ ఎన్నికల్లో కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కే విజయరాజు, పి.పార్థసారథితో పాటు తొమ్మిది మంది కార్యదర్శులు, 7 గురు కౌన్సెలర్స్ 20 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. అనంతరం టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ గ్రహీతలకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఇతర అతిథులు ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానం జరిగింది.

### పౌష్టికాహార మాసోత్సవాలు



గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలో ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఉమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకుని ఆరోగ్యంగా జీవించాలని తెలిపారు. అన్ని పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను చిరుధాన్యాలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, కూరగాయలు, మొలకెత్తిన గింజలు, అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రిషన్ కిట్‌లు బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఎంతో ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం పాల్గొన్నారు.

## మండల స్థాయిలో విద్యార్థులకు పోటీలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎంఈఓ ప్రసాద్

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి పోటీలలో స్థానిక నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారని చేబ్రోలు ఎంఈఓ ఏహెచ్‌వీ ప్రసాద్ శనివారం తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్- 2047 అంశంపై మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో, ఎలాక్యూషన్, డిబెట్ పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన ఎస్కే నజ్మా, వి. మాధురి దాసరి ధరణి, ఎస్కే ఆఫ్రిన్, ఎం.లహరి, ఎస్.కె.హర్షియా రాకేష్‌లు ప్రతిభ సాధించి బహుమతులు సాధించారు. విద్యార్థులను ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో హచ్‌ఎం ఎం.ఏడుకొండలు, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, కోటి, అచ్చిరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే విజయావకాశాలు

- సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ ఫైనాన్స్ ఆఫీసర్ సుధాకర్



విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందిస్తున్న సుధాకర్

ప్రత్తిపాడు: క్రమశిక్షణతో కూడిన చదువు ఒక్కటే విజయానికి మార్గమని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ ఫైనాన్స్ ఆఫీసర్ బి.వి.సుధాకర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు సుధాకర్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ తన చిన్నతనం అంతా పేదరికంతో గడిచిందని, కేవలం ప్రభుత్వ పాఠశాలలలో పట్టుదలతో చదువుకుని ఇప్పుడు ఈ స్థితికి చేరుకోగలిగానని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని తాళ్లూరి గాయత్రికి చదువు నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వట్టిచెరుకూరు మండల విద్యాధికారి గరిమెళ్ళ సత్యనారాయణమూర్తి, రెంటచింతల మండల విద్యాధికారి ఎనుముల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచి శ్రీమతి పి.పార్వతీ శివరామకష్టారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీధర్, గ్రామస్తులు పాతూరి కష్టారావు, కొణిజేటి బుల్లిబాబు, ఉపాధ్యాయులు మోదుగుల రవికష్ణ పాల్గొన్నారు.

## ప్రాథమిక అంశాలపై అవగాహన ముఖ్యం



ముగింపు కార్యక్రమంలో అతిథులతో విద్యార్థులు

చేబ్రోలు: ఇంజినీరింగ్ విద్యార్థులు వారి సబ్జెక్టులపైనే కాకుండా ప్రాథమిక సైన్స్, గణిత విషయాలపై అవగాహనతో మేలని చైనాలోని షెంఝెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మెహరస్ మజాందరణి తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నాన్ లీనియర్ అనాలిసిస్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ (ఐసీఎన్ఏఎస్‌సీ-2024)'పై మూడు రోజుల కాన్ఫరెన్స్ హైబ్రిడ్ మోడ్ కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా మెహరస్ మజాందరణి మాట్లాడుతూ.. మార్కెట్‌లలో ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి, సమీకృత ఆర్థిక మార్పులపై అధ్యయనానికి మేథమేటిక్స్‌లోని డిఫరెన్షియల్ సమీకరణాలనే ఉపయోగించాలన్నారు. జనాభా వృద్ధి, వ్యాధుల వ్యాప్తి వంటి వాటిని అంచనా వేసేందుకు కూడా ఇవి ఉపయోగిస్తామని వెల్లడించారు. యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ ప్రొఫెసర్ పూనమ్ సింగ్ మాట్లాడుతూ.. విమానాలు, రాకెట్లు వంటి సాంకేతిక పరికరాల్లో పునరావృత పరీక్షలు చేయడానికి ఆర్థోగోనల్ అర్రేలతో తక్కువ సంఖ్యల పరీక్షలతో మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. డేటా ట్రాన్స్‌మిషన్‌లో ఆర్థోగోనల్ కోడింగ్ టెక్నిక్స్‌ను ఉపయోగించి లోపాలను నివారించడం సాధ్యం అవుతుందన్నారు. విద్యాసాగర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మధుమంగల్ పాల్ మాట్లాడుతూ.. కంప్యూటర్ విజన్, ఇమేజ్ ప్రాసెసింగ్ రంగాలలో ఫజీ గ్రాఫ్‌లు, టోపోలాజికల్ ఇండెక్సులు వాడటం ద్వారా ఇమేజ్‌లలోని అంచులు, ఆకారాలు, రంగులను సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్జీ రంగా వర్సిటీని సందర్శించిన పెమ్మసాని



సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు రూరల్: నగర శివారులోని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం సందర్శించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు ఉన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ పరిశోధనా స్థానాలు, విస్తరణ కేంద్రాల నుంచి అందిస్తున్న ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనం, డ్రోన్ శిక్షణ సెంటర్‌ను సందర్శించారు. బోర్డు మీటింగ్ రూమ్‌లో ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి, అధికారులు, శాస్త్రవేత్తలతో సమీక్షించారు. పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. పరిశోధన ఫలితాలను, పంట మర్పిడి విధానాలను, వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలను వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. రైతు ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా ప్రస్తుత పంటలకు ప్రత్యామ్నాయాలు సూచించాలని కోరారు.